
డి. కామేశ్వరి

# బిందెడు నీళ్ళు





"అత్తో, ... భూదేవత్తో, మీ అరుణ నీళ్ల ట్యాంకరు కింద పడిందత్తో. సక్రాలకింద పడి నలిగిపోయింది సచ్చిపోయిం దంటున్నారు. బేగిరా అత్తా"... వగరుస్తూ యాదిగాడు తెచ్చిన కబురుకి చేటలో బియ్యం ఎసట్లోకాక కిందపడ్డాయి చేటతో సహా- చేట విసిరేసి 'ఓ నా బిడ్డో, ఓ నా కూతురో' గుండెలు బాదుకుంటూ భూదేవి పరిగెత్తింది. కొంగు జారింది. కొప్పు విడింది చూసుకోకుండా పక్క బస్తీకి వున్నదున్నట్టు పరిగెత్తింది.

రెండు వీధులవతల నీళ్ల ట్యాంకరు చుట్టూ జనం! గోల గోలగా వుంది. గుంపుని రెండు చేతులతో నెట్టుకుంటూ గుండెలు బాదుకుంటూ భూదేవి... నెత్తుటి ముద్దలా వున్న అరుణమీద పడింది. ఎనిమిదేళ్ల అరుణ పొట్టమీంచి ట్యాంకరు వెనక చక్రం వెళ్లి పొట్టలో పేగులు వెళ్లుకొచ్చాయి. నోట్లోంచి రక్తం ఉబికి మొహం, వళ్లూ అంతా రక్తం - 'ఏందిరో భగమంతుడో, నా బిడ్డనిట్టా చేసిన పాపిష్టోళ్లు ఎవర్రా? ఓరి దేముడో నీళ్లట్టుకొస్తానని ఎల్లావే బిడ్డా... గుండెలు బాదుకుంటూ, కూతురు గుండెల మీద పడి ఏడుస్తున్న భూదేవిని నలుగురైదుగురు ఆడవాళ్లు ఓదారుస్తూ వెనక్కి లాగారు. డ్రైవరు గాబోలు పాలిపోయిన మొహంతో పక్కన దోషిలా నిల్చున్నాడు. చుట్టూ చేరిన జనం డ్రైవరును కాకుల్లా పొడుస్తున్నారు - 'ఏందయ్యా... కళ్లు నెత్తినుండాయా... ముందు వెనకా సూడద్దా - ఎనకాల రివర్స్ చేసినప్పుడు సూడొద్దా ఎవరున్నారో... పసిపిల్ల పానాలు మింగినావు కదయ్యా - ఆ తల్లిని సూడు ఎట్టా ఏడుస్తాందో...' అందరూ తలో మాట - డ్రైవర్ అప్పటికే చెప్పి చెప్పి విసిగిపోయిన మాట భూదేవి వచ్చాక మరోమాటు చెప్పాడు. 'ఏందయ్యా! వూరికే లొల్లిసేస్తారు. బండి నడుపుతూంటే ఎనకాల ఏటుందో, ఎవరున్నారో నాకెట్టా కనపడ్తది. మా క్లీనరు రైటు రైటంటే నేను నడిపినా... అయినా బండి నడుస్తావుంటే ఎనకాలసేరి నీళ్లట్టేసుకుందారని ఆ పిల్ల అట్టా అట్టా బిందెట్టుకుని ఎనక్కెనక్కి నడుస్తా వుంది. మా నర్సింహ అరుస్తూనే వుండాడు. మా తప్పేటి...'డ్రైవరు దబాయించాడు. నర్సింహ వైపు తిరిగారంతా కోపంగా... 'ఏట్రా, నడు పోలీసుకాడికి పిల్లని సంపేరు గందరా... ఎనకాలేటుందో సూడకుండా రైటు ఎట్టా సెప్పావు - కల్లు కనవడనేదా... పిల్లదాన్ని రెక్కట్టుకొని పక్కకేనా లాగొద్దా... అసలు మీకు సర్కారు నౌకరీలని గోరోజనం.. బండి సర్రున కోసేయడమే. మీరు నీళ్లిచ్చి గొంతు తడవడానికొచ్చిండ్రా - జనాన్ని సంపడానికొస్తున్నారా - పేపరు తెరిస్తే ట్యాంకరు గుద్ది ఏక్సిడెంటు కేసులే... ఎవరో గద్దించి మాట్లాడుతున్నారు. 'నానేటి సేస్తాను - పాపా, తప్పుకో, తప్పుకో అన్నా... బిందెట్టుకు కారేనీళ్లు ముందస్తుగా పట్టేసుకోవాలని బండితోపాటు ఎనక్కి నడుస్తంది. బిక్కమొహం వేసాడు' నర్సింహ.

'ఎనక్కి నడస్తంది. మరి కింద ఎట్టా పడ్డదిరా-'

'బండి జర్కిచ్చింది - దాంచేతిలో బిందెకి తగిలి బిందె కిందపడింది. అది బిందె ఎత్తుకోడానికి వంగింది.. నేనరుస్తూనే వుండా డ్రైవర్‌కి యినపడలా బండి కోసిండు.. సక్రం కిందవడిపోనాది.. జనం గోలిని బండి ఆపేసరికి అప్పటికే నలిగిపోనాది...' భయం భయంగా చెప్పాడు.

'మరి అట్టా సెప్పండ్రి.. ఎనకాలుండాల్సిన నీవు ముందు తలుపుకాడ నిలబడి రైటు కొట్టావు. ఎనకాలుంటే పిల్ల వంగడం కనవడేది కదా... డ్రైవరు సర్రున వెనక్కి గేరు వేసాడు.' ఎవరో



పాయింటు లాగారు.

'పిల్లదీ తప్పే, ట్యాంకరు వచ్చిందంటే పరుగులే, ముందస్తుగా పట్టేసుకోవాలని కారేనీళ్ల గొట్టం కింద బిందట్టుకుని నడిచింది మరి...' కొందరు ఆడవాళ్లు అన్నారు.

'ఓయి బగవంతుడా, నానేటిసేయనే, సేతికందొచ్చిన పిల్లని సంపేసిండ్రో... నీల్లట్టుకొస్తానని ఎల్లిందీ... పాడు నీల్ల కోసం పిల్లని సంపుకున్నానే- భూదేవి గుండెలు బాదుకుంటూ గుండెలవిసేలా ఏడుస్తోంది.

నలుగురయిదుగురు ఆడవాళ్లు భూదేవిని వెనక్కిలాగి కూచోపెట్టి మంచినీళ్లిచ్చారు తాగడానికి. 'సాయం పట్టండ్రా... పిల్లని తీసి పడుకోబెడదాం.'

'వద్దు వద్దు. పోలీసులొచ్చేదాక తీయకండి కదల్చకండి' ఆ వాడపెద్దమనిషి అన్నాడు. 'పోలీసులకి ఫోనుగొట్టండ్రా...' ఆర్డరిచ్చాడు ఆయన. ఎవరో పరిగెత్తారు. డ్రైవరు, క్లీనరు నల్లబడ్డ మొహాల్తో గోడవారకెల్లి నిలబడ్డారు.

బిందెలతో, బకెట్లతో నిలబడ్డ వాళ్లందరికీ యిళ్లల్లో పనులు గుర్తు వచ్చాయి. పిల్లది సావడం పాతబడింది. యిప్పుడు నీళ్లు పట్టుకోవాలి. సచ్చిన శవం అక్కడుండగా నీళ్లప్పమని అడగాలంటే ఎవరికీ నోరు రాలేదు. సచ్చిన పిల్ల తాలూకు రక్తం మడుగు కట్టిన చోట బిందెలు పెట్టి నీళ్లెట్టా నింపుకోడం. యివాళ నీళ్లు పట్టుకోకపోతే మరి రెండు రోజులదాకా తాగే నీరుండదు కదా. పిల్లదాన్ని లేపుకెడితే బాగుండును. ఎవరికివారికి మనసులో అసహనంగా వుంది. యింటికెల్లిపోతే మళ్లీ నీళ్లు అయిపోతే దొరకవేమో - అంతా వుండలేక, వెళ్లలేక సోద్యం చూస్తూ నిలబడ్డారు.

యిరవై నిముషాలలో పోలీసులొచ్చారు. బస్తీలో పెద్దాయన జరిగింది చెప్పాడు. మూలగా బితుకు బితుకుమంటూ నిలబడిన డ్రైవరు, క్లీనరుని దగ్గరకు పిల్చాడు. 'మీకు వళ్లు కొవ్వురా. వెనకా ముందూ సూడరు- పిల్లదాన్ని సంపారు గదరా. యిప్పుడాళ్లు కేసుపెడితే బొక్కలో తొయ్యాలి మిమ్మల్ని.

'మేమేటి సేస్తాం సారూ- బండి ఆగనీరు, ఒకటే పరుగులు. ఎనకాల పిల్లది నిలబడ్డం జనం అంతా సూసారు. అప్పుడెవరన్నా వద్దు అని సెప్పారా- ఎవరికి పట్టమంటారు. యిప్పుడేమో తప్పంతా మాదే అంటే ఎలా సార్... మేం కావాలని మీదికి తోలామా. పిల్లదాన్ని వుత్తిపున్నానికి సంపుతామా, నాకూ పిల్లలుండారు సాబ్...' బాధగా అన్నాడు డ్రైవర్ వెంకటేసు. ఇన్‌స్పెక్టరు ఏమనడానికీ జరిగిందానిలో ఎవరి తప్పూ లేదు. నీళ్లు పట్టుకోవాలని పిల్ల, వెనకాతల నిలబడడం దాని తప్పే. యిది కావాలని సేసిన ఏక్సిడెంటు కాదు. డ్రైవరుదీ తప్పులేదు- దానికి చావొచ్చి అలా చచ్చింది. ఏదో పోనీ కొంత డబ్బిచ్చి సర్దేద్దామంటే- ప్రైవేటు ట్యాంకరయితే ఓనరుని దబాయించి డబ్బిచ్చి పిల్లవాళ్లని సర్ది చెప్పచ్చు- ఇది మున్సిపాలిటీ టేంకరు...

'ముందు ఆ పిల్లని తీయండి. యింటికి తీసికెళ్లండి సాయంపట్టి - అన్నాడు ఇన్‌స్పెక్టరు. నలుగురైదుగురు యువకులు సాయంపట్టి పిల్లని మోసుకెళ్లి భూదేవి గుడిసె ముందు అరుగుమీద చాపేసి పడుకోబెట్టారు. గుండెలు బాదుకుంటున్న భూదేవిని నలుగురైదుగురాడవాళ్లు నడిపించి లేపి తీసికెళ్లారు.


'అమ్మా, నీళ్లట్టుకొస్తానే అంది. రెండు బిందెలు పట్టుకెళ్లింది. పక్కీధిలోకి ట్యాంకర్ వచ్చింది. తాగే నీళ్లన్నీ రోజూ అదే అట్టుకొస్తంది.. నల్లాకాడ, నేకపోతే ట్యాంకర్ కాడ యియాలిట్టా సేసిందే నా కూతురు. అమ్మా - అరుణమ్మా... నాకు నీళ్లెవరట్టుకొస్తారే రోజూ.. దీర్ఘాలు తీస్తూ ఏడుస్తూంది. కబురెల్లి భూదేవి మొగుడు యాదగిరి పరుగున వచ్చి కూతుర్ని చూసి భోరుమని ఏడుస్తూ చతికిలబడ్డాడు. యిరుగు పొరుగు ఓదార్చారు. యినస్పెక్టరు దగ్గిరకొచ్చి



## నటి అవుతున్న ఎయిర్ హోస్టెస్

లుఫ్తాన్సా వారి దగ్గర ఎయిర్ హోస్టెస్‌గా, మోడల్‌గా పని చేసిన విద్య. విక్రమ్ భట్ కొత్త చిత్రం 'ఇంతెహా'లో కొత్త నటిగా పరిచయం కాబోతున్నది. "ఇందులో నా పాత్ర అద్భుతంగా వుంటుంది. నేను స్టార్‌నవుతానో కానో కానీ, నటిగా మాత్రం పేరు తెచ్చుకుంటానని నా నమ్మకం. నా భవిష్యత్తును గురించిన ఆలోచనలతో కాక వర్తమానాన్ని ఎంజాయ్ చేయటమే ఇప్పటి నా పని" అంటున్నది విద్య. ఈ చిత్రంలో అమీషాపటేల్ సోదరుడు అశ్మిత్ పటేల్ సరసన చేస్తున్నది విద్య.

నిలబడ్డాడు. యిరుగు పొరుగు ఓదార్చారు. ఇన్‌స్పెక్టరు దగ్గిరకొచ్చి నిలబడ్డాడు. ఈ కేసుని ఏం చెయ్యాలో అతనికి అర్థం కావడం లేదు. జనం చూస్తుండగా జరిగిన ప్రమాదం. తప్పు రెండువైపులా వుంది. ఎక్కువ పిల్లదే తప్పు. 'యాదగిరీ... జరిగింది ఘోరమే. కానీ డ్రైవరుది తప్పులేదు. చిన్నపిల్ల నీళ్లు పట్టుకోవాలని వెనకాలుందని తెలియక బండి వెనక్కి నడిపాడు.



## సరదా సమాచారాలు

ఐశ్వర్య చేతి గాయమూ, శారూఖ్ ఖాన్ వెన్ను నొప్పీ తగ్గేందుకు సరిగ్గా మూడు నెలల కాలం పడుతుందట. ఆ ఇద్దరినీ తీసుకున్న దర్శకనిర్మాతలు పాపం, తలలు పట్టుక్కూర్చున్నారు.

రాణీముఖర్జీని పాపం, ఇంత పెద్ద నటి అయినా కూడా, తల్లి చేత లెంపకాయలు తింటుందట!

'మంగల్ పాండే' చిత్రం కోసం కండలు పెంచాలని అమీర్ ఖాన్ విదేశాల కెళ్లాట్ట. మనవాళ్లు పనికి రాకపోయారా? అని కొందరు సాగదీస్తున్నారు.

శారూఖ్ ఖాన్, పాపం, ఎన్నో కలలు కని మరీ కట్టించుకున్న బంగళా 'మన్నత్'ను అమ్మేసి బాంద్రాలోని తన లక్కీ అమృతా అపార్ట్‌మెంట్స్‌కు వెళ్లిపోదామని నిర్ణయించుకున్నాట్ట.


తనకు ఆదర్శపురుషుడైన రజనీకాంత్ తరువాత తాను కూడా రాజకీయాల్లోకి దూకేస్తే సరిపోతుందని కమలహాసన్ నిశ్చయించుకున్నాడని కొత్తగా వినిపిస్తున్నది.

గతంలో దేశంలో ఓ చోట అమితాబ్ బచ్చన్ పేరిట ఓ ఆలయం వెలసింది. ఇప్పుడు ఇండోర్‌లో 'బిగ్ బీ' అనే పేరుతో ఓ థియేటర్ వెలసింది.

ఈ ఆగస్ట్ 26న శబానాఖాన్ పదవీవిరమణ చేశాక, ఆ పదవిని అలంకరించబోయేది డ్రీమ్ గర్ల్ హేమమాలినిట!

యిప్పుడేం అనుకుని లాభం ఏముంది- పోలీసు కేసు పెట్టినా ఏం లాభం - నీ కూతురు నీకు తిరిగి రాదు. ఆడ్ని జైల్లో నాలుగురోజులు కొట్టీ పెట్టి వదిలేస్తారు. తప్పు పిల్లదే అని తేల్చేస్తారు. కేసులు, పోలీసులంటూ నీవెక్కడ తిరుగుతావు. తిరిగినా పిల్ల రాదు. నాలుగు డబ్బు లిపి ప్దామన్నా యిది గవర్నమెంటు ట్యాంకరు. ఏం చేద్దాం చెప్పు.' అన్నాడు సందిగ్ధంగా ఇన్‌స్పెక్టరు. యాదగిరి తలపట్టుకున్నాడు.

'నా కర్మ బాబూ ఎవరేటి సేస్తారు- బంగారంనాటి పిల్ల పోయింది- కేసెడితే నా కొచ్చేదేటి బాబూ - ఏడుస్తూ అన్నాడు. డ్రైవరు వెంకటేసు దగ్గిరకొచ్చి 'అన్నా తప్పైపోనాది అన్నా, సిన్నపిల్లని పొట్టనెట్టుకున్న చమించన్నా, నాకూ యింత కూతురుంది, పిల్లది ఎనకాలుందని తెలియక - 'కళ్లు చమర్చగా యాదగిరి చెయ్యిపట్టుకుని గద్గదికంగా అన్నాడు. అంటూనే జేబులో చెయ్యిపెట్టి దొరికిన నోట్లు



పైకి తీసి 'యిదో అన్న ఈ మూడొందలుంది నాకాడ. పిల్లదానికి ఖరీదు కట్టాననుకోకు. పిల్లదాన్ని మట్టి సేయడానికన్నా డబ్బు కావాలి కందా. వద్దనకు తీసుకో. నా బాధ కాస్త తగ్గుతాది తీసుకుంటే." అపరాధిలా తలదించుకుని అన్నాడు చేతులు ముందుకుచాచి.

కబురు తెలిసి ఆ ఏరియా ఎమ్మెల్యేగారు -పూర్వాశ్రమంలో ఆ వాడలోనే వుండేవాడు) మంది మార్బలంతో వచ్చేశారు. దండాలు, ఏడ్పులు, ఓదార్పులు, పంచాయతీలు దర్బారు సాగింది. 'అంతా విని ఆయన చాలా ఉదారంగా యాదగిరి బుజం తట్టి జేబులోంచి డబ్బులు తీసి 'యాదగిరీ పోయిన పిల్ల తిరిగి రాదు. జరగాల్సింది చూడు. యీ డబ్బుల్తీసుకుని పిల్లదాన్ని సాగనంపు. పోలీసులు, రిపోర్టులు గొడవెందుకు, పిల్లదాన్ని తప్పు వున్నట్టు అందరూ చూశారు గదా.' మరోసారి ఓదార్చి ఆ బస్తీ పెద్దాయనకి అన్ని ఏర్పాట్లు చూడమని పురమాయించి వెళ్లాడు.

కబురు తెలిసి చుట్టాలు, పక్కాలు వచ్చారు. ఏడ్పులు, మొత్తుకోళ్లు అయ్యాయి. ఓదార్పులయ్యాయి. బంధువులంతా నడుంకట్టి హడావిడి చేస్తూ సాయంత్రం పొద్దు తిరగకముందే శవం లేపే ఏర్పాట్లు చూశారు. పిల్లదాన్ని పీటవేసి పడుకోబెట్టారు స్నానం చేయించడానికి. 'అరేయ్ నీళ్లట్టుకురా' ఓ ముసలాడు ఓ కుర్రాడికి పురమాయించాడు. కుర్రాడు ఇంటి బయట సిమెంటు తొట్టిలో చూసాడు. అడుగున రెండు మగ్గులున్నాయి. గుడిసెలోకి చూశాడు. తెల్లగా తోమిన రెండు బిందెలు ఒకదాని మీద ఒకటి కనబడ్డాయి. లోపలికెళ్లి ఒక బిందె తెచ్చి ముసలాడికి అందించాడు. ముసలాయన బిందెడు నీళ్లు భళ్లున దిమ్మరించాడు పిల్లమీద... ఏడ్పు ఆపి గోడకి నీరసంగా సాగిలపడిన భూదేవి కళ్లు తెరిచింది నీళ్ల చప్పుడికి. బిందెడు నీళ్లు దిమ్మరించడం నిలువు గుడ్లేసుకుని చూసింది. 'మరో బిందెడట్రా ముసలాడు మరోసారి ఆర్డరేసాడు. కుర్రాడు లోపలికెళ్లి బిందె అందుకున్నాడు. భూదేవి పూనకం వచ్చినదానిలా లేచి లోపలికి వురికి బిందె లాక్కుని 'నీ జిమ్మడిపోను. తాగుడికి నీళ్లురా యియి. గంట క్యూలో నిల్చుని అరుణమ్మ పాపం తెచ్చిందిరా... బతికి నోల్లకి గొంతు తడిపేందుకు నీల్లు లేవు. సచ్చిందానికి ఎందుక ఎరా నీల్లు. బిందెడు నీళ్లు నేలపాలు సేసావేందిరా. రెండు రోజులు మేం అందరం ఏం తాగాలిరా. ముదనష్టపోడా.. బిందెడు నీళ్లు పారపోసినావు. సాలింక ఎల్లు.' గట్టిగా అరిచి బిందెలాక్కుని కిందపెట్టి మూతపెట్టింది. అందరూ నోళ్లు తెరిచి వింతగా చూస్తూ వుండిపోయారు. మళ్లీ బయటకివచ్చి కూర్చుని శోకాలు ఆరంభించింది భూదేవి.

■